క్లుప్తంగా

వీఎంసీలో నేడు 'స్పందన'

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్, నగరంలోని మూడు సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో ప్రతి సోమవారం ఉదయం 1030 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు.

తూర్పుకాపు అభివృద్ధి సంఘం కమిటీ ఎన్నిక

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీపీఐ కార్యాలయంలోని మారుతీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో తూర్పు కాపు విద్యా, విజ్ఞాన అభివృద్ధి సంఘం విజయవాడ నగర నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా కోన శ్రీహరిసత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు యలకల చలపతి రావు, ప్రధాన కార్యదర్శి చింతా సింహాచలం, కోశాధికారి పిన్నింటి రామారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ చీమల వెంకటరమణ ఎన్నికయ్యారు. వీరితో పాటు 24 మంది ఉపాధ్యక్షులు, 22 మంది గౌరవ సలహాదారులను నియమించారు. అనంతరం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు.

ఆధ్యాత్మిక చింతనతో సమాజంలో శాంతి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజంలో ఆధ్యాత్మిక చింతన పెరిగినప్పుడు శాంతి వర్ధిల్లుతుందని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ అన్నారు. పాత బస్తీలోని షాహి మజీద్ కమిటీ సభ్యులు అమానుల్లా ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని చిన్నారులకు దివ్య ఖురాన్ కంఠస్థ పోటీలను ఇటీవల నిర్వహించారు. విజేతలకు షాహీ మసీదు ఆవరణలో బహుమతుల ప్రదానోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ విద్యార్థులకు ఖురాన్ కంఠస్థ పోటీలను నిర్వహించటం అభినందనీయమన్నారు. అందరూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నాలన్నారు. జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాలకు మేలు చేసే విధానాలను రాష్ట్రంలో అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. న్యాయవాది అల్తాఫ్, మైనార్టీ ప్రముఖులు పాల్గొన్నారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భర్త వేధింపులపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రైజర్‌పేట ఏనుగుల వీధికి చెందిన గర్రె తులసీ, శ్రీనివాస్ భార్యభర్తలు. వీరికి 2007లో వివాహం కాగా ఇద్దరు ఆడపిల్లలు సంతానం. టీవీ మెకానిక్‌గా పని చేసే శ్రీనివాస్ కొంత కాలంగా మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్యను వేధింపులకు గురి చేయసాగాడు. దీంతో పలుమార్లు పెద్దల మధ్య పంచాయతీ జరిగినా మార్పు రాకపోవడంతో తులసీ పుట్టింటికి చేరింది. భర్త వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

రైలు కింద తలపెట్టి వ్యక్తి ఆత్మహత్య



రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): రైలు కింద తలపెట్టి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై విజయవాడ ప్రభుత్వ రైల్వే పోలీసులు(జీఆర్పీ) కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో సింగ్‌నగర్ రైల్వే ట్రాక్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి కదులుతున్న రైలు కింద తల పెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. తల, మొండెం వేరు అయ్యి పట్టాల పక్కన పడి ఉండటంతో గుర్తించిన సిబ్బంది జీఆర్పీ పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి వయసు 45 సంవత్సరాలు ఉంటుందని, వివరాలకు 94406 25744 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రైలు నుంచి జారిపడి మహిళ మృతి



సత్యనారాయణపురం (విజయవాడసెంట్రల్): కదులుతున్న రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని మహిళ మృతిచెందిన ఘటనపై విజయవాడ ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్పీ) కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో సింగ్ నగర్ రైల్వే ట్రాక్ వద్ద గుర్తు తెలియని రైలు నుంచి మహిళ జారిపడి గాయాలతో పడి ఉంది. ఆమెను గుర్తించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మహిళను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి వయసు 23 సంవత్సరాలు ఉంటుందని, ఒంటిపై గులాబీ రంగు టాపు, తెలుపు రంగు లెగ్గిన్ ధరించి ఉందని తెలిపారు. విజయవాడ జీఆర్పీ పోలీస్ స్టేషన్ లేదా 94406 25744 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వైభవంగా కార్తిక పౌర్ణమి








కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం భక్తులు వైభవంగా పూజలు నిర్వహించారు. పవిత్ర కృష్ణానదిలో స్నానాలు ఆచరించి పరమ శివుడిని దర్శించుకుని కార్తిక దీపాలు వెలిగించారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ రిలిజియస్ టూరిజం ఆధ్వర్యంలో భవానీ ద్వీపంలో శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం సౌజన్యంతో ఆది దంపతుల కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

అంబేడ్కర్ భావజాలంతో సీఎం జగన్ పాలన

- ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు
- ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి

భవానీపురం(విజయవాడపశ్చిమ): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా విధానం, భావజాలంతో పని చేసే ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షులు బూదాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం తుమ్మలపల్లి కళాక్షేత్రం ఎదురుగాగల అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం జగనన్న వెంటే వారంతా ఉంటారన్నారు. గత ప్రభుత్వం హయాంలో రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి పాలన సాగించిన చంద్రబాబును ప్రజలు తిరస్కరించారని గుర్తు చేశారు. ఒక వైపు అభివద్ధి మరో వైపు సంక్షేమ దిశగా పారదర్శకంగా సాగుతున్న జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్న ఆకాంక్ష ప్రజల్లో బలంగా ఉందన్నారు.

పొత్తు చిత్తు కాక తప్పదు

టీడీపీ, జనసేన పొత్తు చిత్తు కాక తప్పదని, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆ రెండు పార్టీల సమావేశాల్లో జరుగుతున్న అంతర్గత గొడవలే అందుకు నిదర్శనమన్నారు. రాజకీయ అవగాహన లేని పవన్ కల్యాణ్ తెలంగాణలో బీజేపీతో, ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీతో జత కట్టడంపట్ల ప్రజలు అసహ్యించుకుంటున్నారని తెలిపారు. ఇక చంద్రబాబు విషయానికి కొస్తే తనకు అనేక రోగాలు ఉన్నాయని కోర్టుకు తెలియపరిచి బెయిల్ పొందిన అతను రాజకీయాలు మానేసి విశ్రాంతి తీసుకోవడం మంచిదని హితవు పలికారు. అజ్ఞాని లోకేష్ యువగళం యాత్ర పునః ప్రారంభించడం చూస్తుంటే పవన్‌తో కలిసి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై బురద చల్లేందుకే తిరిగి మొదలుపెట్టినట్లుందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోలిమెట్ల శరత్, విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరావు, ఎస్సీ సెల్ నాయకులు మధిర ప్రభాకర్, లేళ్లపూడి లాజర్, కామళ్ల జోజి, మంటి కోటేశ్వరరావు, కె.డేవిడ్, వడ్డాది అనిత, వి.సురేష్, ఎం.బాబు, ఎం.బాబూ రావు, తంగిరాల ఎలీష పాల్గొన్నారు.



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పోలీస్ కమిషనరేట్‌లో..

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు ఆదివారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఓ ఏఓ టి.రంగారావు సీపీ టీకే రాణా సందేశాన్ని వినిపించారు. భారత రాజ్యాంగ పరిషత్ సభ్యులు రూపొందించిన రాజ్యాంగాన్నిను శాసనంగా ఆమోదించిన సందర్భంగా ప్రతి ఏడాది నవంబర్ 26న 'రాజ్యాంగ దినోత్సవం' జరుపుకుంటామన్నారు. అనంతరం సిబ్బంది చేత ఆయన రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ అధికారులు, సిబ్బంది, సీపీఓ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీఎంసీలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

పటమట(విజయవాడతూర్పు): ప్రపంచ దేశాల్లో భారత రాజ్యాంగం అత్యున్నతమైనదని, భారత రాజ్యాంగ రూపకల్పనలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ చేసిన కృషి ఎనలేనిదని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఆదివారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఆయన నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం రూపకల్పనకు రెండున్నరేళ్ల సమయం పట్టిందని, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేతృత్వంలోని డ్రాఫ్ట్ కమిటీ ఆధ్వర్యంలో రాజ్యాంగం రూపొందించబడిందని, 1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిందన్నారు. రాజ్యాంగానికి 1949 నవంబర్ 26న ఆమోదముద్ర పడిందని చెప్పారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, డాక్టర్ బాబూరాజేంద్రప్రసాద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కార్పొరేషన్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (జనరల్) కే శకుంతల, అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) కే సత్యవతి, వీఎంసీ మేనేజర్ బి.శ్రీనివాస్, కార్పొరేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కురియన్ జయంతి



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కురియన్ ఆదర్శ సూత్రాలను పాటిస్తున్న విజయ డెయిరీ పాడి రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నామని కృష్ణా మిల్క్ యూనియన్(విజయ డెయిరీ) చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. శ్వేత విప్లవ పితామహులు డాక్టర్ వర్గీస్ కురియన్ 102వ జయంతి వేడుకలను కృష్ణా మిల్క్ యూనియన్ పరిపాలనా భవన ఆవరణలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబు, పాలకవర్గ సభ్యులు చలసాని చక్రపాణి, వేమూరి సాయి వెంకట రమణలతో కలిసి కురియన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చైర్మన్ ఆంజనేయులు మాట్లాడుతూ.. పాడి రైతుల సర్వతోముఖాభివృద్ధికి కృష్ణా మిల్క్ యూనియన్ ఎనలేని కృషి చేస్తోందన్నారు. పాడి రైతుల సంక్షేమంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించడమే యూనియన్ ముఖ్య లక్ష్యమని చెప్పారు. అనంతరం పాలప్రాజెక్టులోని వివిధ విభాగాలకు చెందిన ముఖ్య అధికారులకు, సిబ్బందికి మిఠాయిలను పంపిణీ చేశారు.

పున్నమి ఘాట్‌లో ఏర్పాట్ల పరిశీలన



భవానీపురం(విజయవాడపశ్చిమ): పవిత్ర కార్తిక మాసంలో భాగంగా సోమవారం వేకువ జామున భక్తులు పుణ్య స్నానాలను ఆచరించేందుకుగాను భవానీపురం పున్నమిఘాట్‌లో చేస్తున్న ఏర్పాట్లను 40వ డివిజన్ కార్పొరేటర్ యర్రబ్ల ఆంజనేయరెడ్డి, భవానీపురం సీఐ కృష్ణ, మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందితో కలిసి ఆదివారం సాయంత్రం పరిశీలించారు. గట్టు వెనుక ప్రాంతంలోని సాధారణ భక్తులతో పాటు అయ్యప్ప, శివ, గోవింద మాలాధారులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా సజావుగా పుణ్య స్నానాలు ఆచరించేందుకు అవసరమైన ఏర్పాట్లను నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేస్తున్నట్లు కార్పొరేటర్ ఆంజనేయరెడ్డి తెలిపారు.

శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకారంలో స్వామి వారు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శైవక్షేత్రాలు ఆదివారం రాత్రి భక్తులతో పోటెత్తాయి. పరమ శివునికి అత్యంత ప్రీతికరమైన కార్తిక మాసం అందులోనూ మహాపర్వదినమైన పౌర్ణమి రోజున ముక్కంటిని పూజించేందుకు భక్తులు ఆలయాల్లో బారులు తీరారు. కార్తిక పౌర్ణమి రోజున స్వామిని పూజిస్తే అద్భుతమైన ఫలితాన్ని అనుగ్రహిస్తాడని భక్తుల నమ్మకం. ఆదివారం మధ్యాహ్నం నుంచి పౌర్ణమి ఘడియలు ప్రారంభమయ్యాయి. రాత్రి సమయంలో చంద్ర దర్శనం చేసుకొని భక్తులు ఉపవాసదీక్షలను విరమించి కార్తిక దీపాలను వెలిగించారు. సోమవారం సాయంత్రం వరకూ కార్తిక పౌర్ణమి ఘడియలు కొనసాగుతున్నాయి.

పోటెత్తిన పాతశివాలయం

నగరంలో అత్యంత పురాతనమైన ఆలయంగా ప్రసిద్ధికెక్కిన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లింగార్చన, విశేష ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలను అర్చకస్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. అదేవిధంగా ఆలయంలోని వివిధ ఉపాలయాల్లో సైతం భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి, కార్తిక దీపాలను వెలిగించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారిణి అనూరాధ పర్యవేక్షించారు. రాత్రి ఆలయంలో జ్వాలాతోరణం కార్యక్రమాన్ని నిర్వహించారు. వన్‌టౌన్ సైకం వారి వీధిలో వేంచేసి ఉన్న శ్రీ ధర్మేశ్వరస్వామి వారి దేవస్థానంలో భక్తులు పోటెత్తారు. స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలను నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడే మురళీ పర్యవేక్షించారు. వించిపేట రామ్‌గోపాల్‌వీధిలోని రామ్‌గోపాల్ సత్రంలో వేంచేసి ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి వారి దేవస్థానంలో భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామి వారికి విశేష అర్చనలు నిర్వహించారు. రాత్రి జ్వాలాతోరణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

కూచిపూడి కళావైభవం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి రోజా

భవానీపురం(విజయవాడపశ్చిమ): కూచిపూడి కళావైభవం పేరుతో భారత్ ఆర్ట్స్ అకాడమి, ఏబీసీ ఫౌండేషన్ సంయుక్తంగా డిసెంబర్ 24న హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో గిన్నీస్ బుక్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదు కోసం నిర్వహించనున్న మహా బృంద నాట్య కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె రోజా ఆవిష్కరించారు. ఆదివారం భవానీ ద్వీపంలో జరిగిన కార్తిక మాసోత్సవంలో పాల్గొన్న క్రమంలో మంత్రి రోజాతో భారత్ ఆర్ట్స్ అకాడమి అధ్యక్షురాలు లయన్ లలితరావు, ఏబీసీ ఫౌండేషన్ అధ్యక్షుడు లయన్ కేవీ రమణారావు ఈ పోస్టర్‌ను ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా సంప్రదాయ కళలు, కళాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని మంత్రి రోజా తెలిపినట్లు లలితరావు, రమణారావు పేర్కొన్నారు.

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం రెండో ఆదివారం, పౌర్ణమి నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ కనిపించింది. తెల్లవారుజామున నుంచే ఉభయదాతల రాష్ట్రాలకు చెందిన భక్తులు నగరానికి చేరుకుని పవిత్ర కృష్ణా నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. మహామండపం లిఫ్ట్, మెట్లతో పాటు ఘాట్‌రోడ్డు మీదగా కొండపైకి చేరుకుని దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. ఉదయం నుంచి భక్తుల రద్దీతో క్యూలైన్లన్ని కిటకిటలాడాయి. దేవస్థాన అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పలు ఆర్జిత సేవలతో పాటు మల్లేశ్వర స్వామి వారికి నిర్వహించిన అర్చనలతో పాటు సహస్ర లింగార్చనలో ఉభయదాతలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ సెక్షన్ పరిధిలోని 11 కేవీ చిట్టినగర్ ఫీడర్ లైన్ మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

విజయవాడకల్చరల్: దృశ్యవేదిక సాంస్కృతిక సేవా సంస్థ నెల వారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం సంప్రదాయ కూచిపూడి నృత్య కార్యక్రమాలు, రంగస్థల ప్రముఖుడు కుప్పిలి వెంకటేశ్వరరావు శత జయంతి వేడుకలు, జరుగుతున్న కథ సాంఘిక నాటిక ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రంగస్థల నటుడు దర్శకుడు మిశ్రో, విద్యావేత్త డాక్టర్ ఎంసీ దాస్ మాట్లాడుతూ ఉత్తమ దర్శకుడు కుప్పిలి వెంకటేశ్వరరావు అని అభివర్ణించారు. నాటక ప్రమోక్త వైఎస్ కృష్ణేశ్వర రావు, దృశ్య వేదిక వ్యవస్థాపకుడు హెచ్‌వీఆర్ఎస్ ప్రసాద్, దొంతాల ప్రకాష్, నవీన్, నాట్యాచారిణి పద్మశ్రీ హేమంత్ పాల్గొన్నారు.

అలరించిన నాటిక ప్రదర్శనలు

విజయవాడకల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ఏపీ సృజనాత్మక సమితి, శ్రీ శ్రీనివాసా నాట్యమండలి ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై ఆదివారం ప్రదర్శించిన సాంఘీక నాటిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భారత జాతిలో స్ఫూర్తిని నింపిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ బాల్యం, విద్యాభ్యాసం, రాజ్యాంగ నిర్మాతగా ఎదగడం అంశాలుగా ద లీడర్ అంబేడ్కర్ నాటిక సాగింది. లాజర్ నాటకాల్లోని సన్నివేశాలను ప్రదర్శించారు. శ్రీ శ్రీనివాసా నాట్యమండలి వ్యవస్థాపకుడు వి.ధర్మదత్తు పాల్గొన్నారు.

సినీ సంగీత విభావరి

విజయవాడకల్చరల్: జేఎంఎస్ సరాగాలు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బందరురోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయని ఝాన్సీ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ గాయకులు చిత్రగీతాలను ఆలపించారు. వివిధ సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, గోళ్ల నారాయణరావు, డాక్టర్ బోడి ఆంజనేయరాజు, డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణాయుత జీవితం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎన్‌సీసీ శిక్షణ పొందటం ద్వారా క్రమశిక్షణాయుత జీవితాన్ని అనుసరించేందుకు అవకాశముంటుందని కాకరపర్తి భావనారాయణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అన్నారు. ఆ కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. దేశభక్తి భావాలను పెంపొందించుకుంటూ విద్యార్థులు తమను తాము ఉత్తమంగా ఆవిష్కరించుకునేందుకు ఎన్‌సీసీ ముఖ్య భూమికను పోషిస్తుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, నాయకత్వ పటిమను తీర్చిదిద్దటానికి ఎన్‌సీసీ ముఖ్య సాధనంగా ఉందన్నారు. విద్యార్థి దశలో ఎన్‌సీసీ శిక్షణ వారిని క్రమశిక్షణతో పాటుగా జీవితాంతం ఉత్తమ నడవడికతో ముందుకు సాగే విధంగా తీర్చిదిద్దుతాయని చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ కేపీటీ విజయభాస్కర్ మాట్లాడుతూ.. తమ కళాశాలలో సుదీర్ఘ కాలంగా ఎన్‌సీసీ విభాగం విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దుతుందన్నారు. తమ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు ఆర్‌డీ క్యాంప్‌నకు ఎంపికై తమ ప్రతిభను ప్రదర్శించటం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు పలు నమూనాలను ప్రదర్శించి అవగాహన కల్పించారు.

సంతాన సాఫల్య చికిత్సలపై అవగాహన సదస్సు

లబ్బీపేట(విజయవాడతూర్పు): వంధత్వంతో బాధపడుతున్న జంటలకు ప్రయోజనం చేకూర్చేందుకు సహాయ పునరుత్పత్తి పద్ధతుల్లో నూతన ప్రక్రియలు, అధ్యయనాలపై ఆదివారం నగరంలో సదస్సు నిర్వహించారు. విజయవాడ అబ్‌స్టెట్రిక్స్ సొసైటీ, నోవా ఐవీఎస్ సెంటర్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన ఈ సదస్సులో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ప్రసూతి వైద్యులు, సంతాన సాఫల్య కేంద్రాల వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంతాన సాఫల్య నిపుణురాలు డాక్టర్ వై.స్వప్న మాట్లాడుతూ.. పెరుగుతున్న వంధత్వ సమస్యల గురించి మరింత అవగాహన అవసరమన్నారు. వైద్య నిపుణులను సంప్రదించేందుకు ఎప్పుడు సరైన సమయమో తెలుసుకోవాలన్నారు. సరైన సమయంలో వైద్యులను సంప్రదించడం ద్వారా ఫలితాలు పొందవచ్చునని ఆమె సూచించారు. గర్భిణులకు నిరంతర పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ గైనకాలజిస్టులు డాక్టర్ కోడే ప్రభాదేవి, డాక్టర్ శ్రీలక్ష్మి అట్లూరి పాల్గొన్నారు.

కళాకారులు సాంస్కృతిక వారసులు

విజయవాడకల్చరల్: కళాకారులు సాంస్కృతిక వారసులని కామ్రేడ్ జీఆర్‌కె –పోలవరపు కోటేశ్వర రావు సాంస్కృతిక సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు అన్నారు. ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో ఆదివారం సంగీత విద్వాంసుడు పాణ్యం దక్షిణామూర్తికి ఆత్మీయ గురు సత్కారం, కూచిపూడి నృత్యాలు, అన్నమయ్య సంకీర్తనా ప్రణవం కార్యక్రమాన్ని నిర్వహించారు. సాహితీవేత్త డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ వెన్నా వల్లభరావు, చింతా వెంకటేశ్వర్లు, నాట్యాచార్యులు వేదాంతం పార్థసారథి తెలుగు షార్ట్ ఫిలిమ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డీవీరాజు ప్రసంగించారు. జంగం విజయ్‌కుమార్, జంగం చక్రవర్తి డాక్టర్ పాణ్యం దక్షిణామూర్తిని గురుసత్కారంతో సత్కరించారు.